ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 9 సెప్టెంబరు 2024



రెడ్ అలర్ట్

» నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు.. ఐఎండీ హెచ్చరికలు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 8 : వరుణుడు ఉగ్రరూపం దాల్చాడు. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో నాలుగురోజుల పాటు వర్షాలు కురుస్తాయని, సోమ, మంగళ వారాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణ హెచ్చరికలలో భాగంగా ఏలూరు జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. జిల్లాలో కుంభవృష్టిగా వర్షాలు కురు స్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా తమ్మిలేరు ఉధృతంగా పొంగుతోంది. ఎర్రకాల్వ ప్రాజెక్టులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం రాత్రి భారీగా వర్షం కురిస్తే ఎర్రకాల్వ పరీవాహక ప్రాంతాలకు వరద పొంచి ఉందని చెబుతున్నారు. ఏలూరు నగరంలో శనివారపుపేట కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీటి ప్రవాహం ఉండడంతో రాకపోకలు నిలిపివేశారు. కొంగువారిగూడెం ఎర్రకాల్వ ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టును 3,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా సార్వా సాగులో వేసిన పంటలు ముంపు బారిన పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా చాట్రాయి మండలంలో 68 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 25.5 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 58.4, కామవరపుకోట 55.8, ముసునూరు 49.4, కుక్కునూరు 46.4, లింగపాలెం 45.2, ఆగిరిపల్లి 41.8, పెదవేగి 41.2, జీలుగుమిల్లి 41.2, దెందులూరు 27.4, కొయ్యలగూడెం 27.2, నూజివీడు 26.4, ఏలూరు రూరల్ 24.8, టి.నరసాపురం 20.6, ద్వారకా తిరుమల 20.2, ఏలూరు అర్బన్ 19, పెదపాడు 13.8, బుట్టాయిగూడెం 13.4, జంగారెడ్డిగూడెం 12.6, చింతలపూడి 12.4, కైకలూరు 10.2, భీమడోలు 9.6, ముదినేపల్లి 5.6, మండవల్లి 5.6 , పోలవరం 4.8, కలిదిండి 4.4, ఉంగుటూరు 4.2, నిడమర్రు 3.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

కలసిగట్టుగా పనిచేయాలి : కలెక్టర్

జిల్లాలో వరద ప్రమాదం తగ్గే వరకు ఎటువంటి నష్టాలు కలుగకుండా అధికారులందరూ కలిసిగట్టుగా పనిచేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరద పరిస్థితిపై జిలా, మండల స్థాయి అధికారులతో ఆదివారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టిందని, తమ్మిలేరు, కొల్లేరులో కొంత వరద ఉధృతి ఉందని, అయినప్పటికీ అధికారులందరూ వరద ప్రమాదం తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెదపాడు, మండవల్లి, కొల్లేరు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, భోజన, వసతి సదు పాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, భోజనం నాణ్యతతో ఉండాలన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించండి : మంత్రి

జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. ఆదివారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో వరద పరిస్థితి పై మంత్రి టెలిఫోన్ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

ఏలూరు అర్బన్ : ఎడతెరిపిలేని వర్షాల ప్రభావం, వాతావరణశాఖ హెచ్చరికలతో సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం, ఆర్‌ఐవో చంద్రశేఖరబాబు, డిగ్రీ కళాశాలల కో-ఆర్డినేటర్ మల్లేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సెలవుకు ప్రత్యామ్నాయంగా మరో పనిదినాన పాఠశాలలు పని చేయాల్సి ఉంటుందని డీఈవో స్పష్టం చేశారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జరగాల్సిన ఎస్‌ఏఎంపీ-1 పరీక్షలు మరో రోజుకి వాయిదా పడ్డాయి.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ రద్దు

ఏలూరు రూరల్ : జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల, మునిసిపల్ కార్యాలయాల్లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని భారీ వర్షాలు, అధికారులంతా ముంపుప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమైన కారణంగా రద్దు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు.



గుడివాక లంకవద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

కొల్లేరు..గండం!

ముంపు బారిన లంక గ్రామాలు

» నీట మునిగిన రహదారులు.. స్తంభించిన రాకపోకలు

» ముంపు గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యేలు



పెనుమాకలంక గ్రామంలోకి చేరిన కొల్లేరు వరద



కైకలూరు-కలిదిండి రోడ్డులో గోపవరం వద్ద ముంపులో పుల్లవా డ్రెయిన్ వంతెన

కైకలూరు/మండవల్లి/ ఏలూరు రూరల్/కలిదిండి : భారీగా వరద నీరు కొల్లేరులోకి చేరడంతో వరద లంక గ్రామాలను చుట్టుముట్టడంతో పాటు వందలాది చేపల చెరువులు నీటమునిగాయి. రోడ్లు ముంపు బారిన పడి లంక గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచి పోయాయి. కొల్లేరు సరస్సును ఆనుకుని ఉన్న చేపపిల్లల చెరువులు సుమారు 600 ఎకరాలకు పైగా నీటమునిగి లక్షల్లో రైతులు నష్టాన్ని చవిచూశారు. మరో రెండు రోజుల పాటు భారీగా వరదనీరు కొల్లేరులోకి చేరనున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కైకలూరు-ఏలూరు రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు. గోకర్ణపురం నుంచి పైడిచింత పాడుకు వెళ్లే రహదారి పూర్తిగా ముంపునకు గురైంది. ఆయా గ్రామాల్లోని ప్రజలు పడవలపై రాకపోకలను సాగిస్తున్నారు. ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారిలో వడ్లకూటితిప్ప నుంచి సర్కారు కాల్వ వరకు ఉన్న రహదారికి, సర్కారు కాల్వ నుంచి పందిరిపల్లిగూడెం వరకు ఉన్న రోడ్డులో రెండు చోట్ల గండ్లు పడి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పందిరిపల్లిగూడెం నుంచి సర్కారు కాల్వ వరకు రహదారి గండ్లకు గ్రామస్థులు ఇసుకమూటలతో అడ్డుకట్ట వేశారు. అయినా నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. సర్కారు కాల్వ నుంచి ఉధృతంగా వరదనీరు ఉప్పుటేరులోకి ప్రవహిస్తోంది. పందిరిపల్లిగూడెం గ్రామ రహదారులు ముంపు బారిన పడ్డాయి. వరదనీరు చేరడంతో కైకలూరు మండలంలోని పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, గోకర్ణపురం, గుమ్మళ్ళపాడు, వడ్లకూటితిప్ప, పెంచికలమర్రు, కొట్టాడ, జంగంపాడు, పల్లిపాలెం గ్రామాలను నీరు చుట్టుముట్టింది. ఆలపాడులోని ఉప్పుటేరును ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, కనుమూరి రఘురామకృష్ణంరాజు పరిశీలించారు.

ముంపు బారిన కైకలూరు

ఎగువ నుంచి కొల్లేరులోనికి వరద నీరు రావడం వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కైకలూరు వెలమపేట కాలనీ, కొత్తపేట, బస్టాండు ఎదురుగా ఉన్న రోడ్డులో సొసైటీ బ్యాంకు, ఇళ్ళు నీటమునిగాయి. కైకలూరు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారిలో గోపవరం వద్ద పుల్లవా డ్రెయిన్ పొంగి పొర్లడంతో వంతెన ముంపునకు గురై రాకపోకలను నిలిపివేశారు. తామరకొల్లు నుంచి వేమవరప్పాడు రోడ్డు ముంపునకు గురై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు రహదారిపై రాకపోకలు జరగకుండా ట్రాక్టర్ ట్రక్కులను అడ్డుపెట్టారు. అగ్రహారం రోడ్డులోనికి పుల్లవా డ్రెయిన్ పొంగి రహదారి ముంపునకు గురైంది.

జలదిగ్బంధంలో కొల్లేటి లంకలు

మండవల్లి మండలంలో రోజురోజుకి కొల్లేటి నీటిమట్టం పెరగడంతో కొల్లేటిలంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గ్రామాల నుంచి బయటకు వచ్చేందుకు పడవులను ఆశ్రయిస్తున్నారు. పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. మూలపేట, ఉనికిలి గ్రామాల్లోను పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. మూలపేటలోని ప్రభుత్వ పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఓలేటి పరిసర ప్రాంతాల్లోని గ్రామాలు రహదారులు పూర్తిగా ముంపు నీటిలో చిక్కుకుని రాకపోకలు స్తంభించిపోయాయి. ఆదివారం నాడు కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధికార యంత్రాంగంతో ముంపు ప్రాంతాలను పర్యటించి సహాయ సహకారాలను తక్షణమే చేపట్టమని ఆదేశించారు. పెనుమాకలంక ప్రజలు కొల్లేటిలో బోటు ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

ఏలూరు రూరల్ మండలం కొల్లేరులోకి వరదనీరు పోటెత్తడంతో మొండికోడు, గుడివాకలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. మొండికోడు, గుడివాకలంక, కలకుర్రు గ్రామాలకు వరదనీరు వస్తోంది. మొండికోడు, గుడివాకలంక గ్రామాలకు వెళ్ళే రహదారి పై వరదనీరు చేరడంతో రెండుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అధికారులు పర్యటించి వరద తగ్గేవరకు ఎవరు బయటకు రావద్దని అప్రమత్తం చేశారు.

పొంగుతున్న ఉప్పుటేరు

కలిదిండి మండలంలో ఉప్పుటేరు పొంగడంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీంతో తీర గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల సంస్థ హెచ్చరికలు జారీ చేయడంతో ఉప్పుటేరు అంచున పూరిళ్లలో నివశించే వారిని అధికారులు పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. ఉప్పుటేరు ఇరువైపులా సుమారు 50 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. ఉప్పుటేరు పొంగితే చెరువుల గట్లు తెగి చేపలు, రొయ్యల ఉప్పుటేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ గ్రామాల్లో ముంపు బారిన పడే ప్రజలను పునరావాస కేంద్రాలకు అధికారులు తరలిస్తున్నారు. అధికారులు ఉప్పుటేరు తీర గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



మండవల్లి మండలం నుచ్చుమిల్లి వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించేందుకు పడవపై వెళ్తున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఉధృతంగా తమ్మిలేరు

ముసునూరు/చింతలపూడి : ముసునూరు మండల పరిధిలో ఉన్న తమ్మిలేరులో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వెంకటాపురం చెక్‌డ్యామ్ సమీపంలో ఉన్న రైతులు నర్రా వేణుగోపాలరావు, గుళ్ళపల్లి వెంకటేశ్వరావులకు చెందిన పామాయిల్‌తోట కోతకు గురవుతోంది. పామాయిల్ మొక్కలు సైతం కొట్టుకుపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తమ్మిలేరు వరద ప్రవాహాన్ని ఆదివారం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 347.98 అడుగుల నీటిమట్టం ఉంది. ఇన్‌ఫ్లో 3,333 క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువకు మూడు షట్టర్ల ద్వారా 3,579 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.



కొణికిలో ట్రాక్టరుపై ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



కడిమికుంటలో ఇళ్ల మధ్యకు చేరిన వరద నీరు

పొంగిన వాగులు



కొత్తగూడెం-యర్రావారిగూడెం మధ్య ఉధృతంగా ఉప్పువాగు

టి.నరసాపురం/చాట్రాయి/ముసునూరు/ జీలుగుమిల్లి/ బుట్టాయగూడెం : భారీవర్షాలకు టి.నరసాపురం మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం- అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఉన్న ఎర్రకాల్వ వాగు ఆదివారం పొంగింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిషేధించారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటవద్దని ఎస్‌ఐ ఎం.జయబాబు సూచించారు. చాట్రాయి మండలంలో పెద్ద చెరువు వాగు, ఉప్పువాగు, రేగటివాగు, చింతకొయ్య వాగులు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముసునూరు మండలంలో ముసునూరు-వలసపల్లి ప్రధాన రహదారిలోని ఊటవాగు వరదనీటికి వరి, పత్తి పంటలు నీటమునిగాయి. చెక్కపల్లి వద్ద సంధ్యవాగు ఉధృతంగా ప్రహిస్తుండడంతో ఎనిమిది రోజులుగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. లోపూడి-ఎర్రవారిగూడెం రోడ్డులోని ఉప్పువాగు మూడు అడుగులు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. సింహాద్రిపురం వద్ద రాములేరు వాగును ఎంపీడీవో జి.రాణి పరిశీలించారు. జీలుగుమిల్లి మండలంలో శనివారం సాయంత్రం జీలుగుమిల్లి సమీప అశ్వారావుపేట వాగు రోడ్డు పైనుంచి పొంగి ప్రవహించడంతో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వాగుల వద్ద పరిస్థితిని ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ పరిశీలించారు. వంకవారిగూడెం వాగు కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. రాచన్నగూడెం శివారు లంకాలపల్లివాగు పొంగి ప్రవహించి బంగారు పాపమ్మ చెరువులోకి వరదనీరు భారీగా చేరింది. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం-రామారావుపేట గ్రామాల మధ్య జల్లేరు కొండవాగు కల్వర్టు కొట్టుకుపోయిందని అటుగా వెళ్ళే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వాగు పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా గుబ్బల మంగమ్మతల్లి ఆలయాన్ని మూసివేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఏజెన్సీలో వర్షాల కారణంగా వాయిదా వేసుకోవాలని ఆర్డీవో అద్దన్న సూచించారు.

జలాశయం గేట్లు ఎత్తివేత

గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం గేట్లను ఎత్తి 200 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఏఈ సురేష్ తెలిపారు. కొండవాగుల ద్వారా జలాశయానికి 375 క్యూసెక్కుల వరదనీరు వస్తోందన్నారు. జలాశయం పూర్తి నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215.65 ఎంటీఎస్‌గా ఉందన్నారు.



కల్వర్టు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న రెడ్డిగణపవరం జల్లేరు కొండవాగు

కొవ్వాడ నుంచి 360 క్యూసెక్కులు విడుదల

పోలవరం : పోలవరంలో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతోంది. గోదావరి వరద జలాలు పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 89.80 మీటర్లకు చేరుకోవడంతో రెండు గేట్లు ఎత్తి 360 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు రిజర్వాయర్ సిబ్బంది సత్యనారాయణ తెలిపారు. ఈ జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు నీటిలో మునిగి ఉండడంతో కొండవాగుల జలాల్లో పంట పొలాల్లోనే మునిగి ఉన్నాయి. గుంజవరం, పేద్రాల, నక్కల కాల్వలు పొంగుతున్నాయి.

వాగు దాటుతూ అధ్యాపకుడి మృతి



సూర్యప్రకాశ్ (ఫైల్)

చాట్రాయి/లింగపాలెం : మండలంలోని తుమ్మగూడెం శివారు బిల్డింగ్‌గూడెం వద్ద ఆదివారం బైక్‌పై వస్తున్న పొదిలి సూర్యప్రకాశ్ (35) ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. లింగపాలెం మండలం తోచిలక గ్రామానికి చెందిన పొదిలి సూర్యప్రకాశ్ మరో యువకుడితో కలిసి బైక్‌పై తుమ్మగూడెం శివారు చదలవాడలో బంధువుల ఇంట జరిగే పెద్దకర్మకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. దారిలో బిల్డింగ్‌గూడెం వద్ద ఊర చెరువువాగులో వరద నీరు ప్రవహిస్తోంది. సూర్యప్రకాశ్‌కు వాగు గురించి అవగాహన లేకపోవడం, నీటిలో దారి కన్పించకపోవడంతో ప్రమాదవశాత్తు కల్వర్టులో పడిపోయారు. సూర్యప్రకాశ్‌పై బైక్ పడడంతో మృతి చెందాడు. మరో యువకుడిని స్థానికులు కాపాడారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి శవ పంచనామా జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు ఏలూరు ఎన్నారై కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మళ్లీ ముంచేసిన బుడమేరు..

» ముంపు బారిన కొణికి, రాళ్లపల్లివారిపాలెం, గోగుంట గ్రామాలు

» ఎమ్మెల్యే చింతమనేని, ఐజీ, ఎస్పీ పర్యటన.. బాధితులకు పరామర్శ

పెదపాడు : బుడమేర వాగు వరద మరోసారి పోటెత్తి గ్రామాలను, ఇళ్లను ముంచెత్తడంతో కొణికి, రాళ్లపల్లివారి పాలెం, కడిమికుంట, గోగుంట గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. వీరిని అధికారులు వడ్డిగూడెం, వసంత వాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించగా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించి, ముంపు తీవ్రతను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, దాని ఫలితమే నేడు ఈ గ్రామాలు ముంపుబారిన పడ్డాయన్నారు. ముంపు గ్రామాల్లో వరద నీరు కిందికి పోయేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక నాయకులు, అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. మోరు శ్రావణి, దశరథ్, గుత్తా అనిల్, అక్కినేని వంశీకృష్ణ, పొట్లూరి యుగంధర్, లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబు, లావేటి హేమసుందర్, గుండపనేని కళ్యాణ్, రంభా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి : ఐజీ



పెదపాడు/ఏలూరు క్రైం : బుడమేరు వరద ప్రభావంతో ముంపునకు గురైన గ్రామాల్లో స్టేట్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ముంపునకు గురై న కడిమికుంట, కొణికి, వడ్డిగూడెం, ఏలూరు రూరల్ మండలం పెదడ్లగాడి ప్రాంతంలో నీటమునిగిన ఏలూరు - కైకలూరు రోడ్డు పరిస్థితిని ఎస్పీ ప్రతాప శివ కిశోర్‌తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఐజీ సూచించారు. డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏలూరు, పెదవేగి ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, నబీ, పెదపాడు ఎస్‌ఐ కె.శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు, చిత్రంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

జిల్లా పరిషత్‌పై .. పసుపు పతాక

టీడీపీలో చేరేందుకు చైర్మన్ ఘంటా పద్మశ్రీ సుముఖం

» సీఎం చంద్రబాబు సమక్షంలో చేరాలని నిర్ణయం

» అంతకుముందే వైసీపీకి రాజీనామా

» సైకిల్ ఎక్కనున్న మరికొందరు జడ్పీటీసీలు

» చింతమనేనితో పార్టీ ముఖ్యుల సమాలోచనలు

» రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమక్షంలో దేశంలో చేరిన జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు

వైసీపీ కీలక పదవుల్లో ఉన్న వారు ఇతర పార్టీల్లో చేరేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. జడ్పీ చైర్మన్ పద్మశ్రీ దంపతులు టీడీపీ తీర్థం తీసుకో బోతున్నారు. ఇప్పటికే ఆమె భర్త ప్రసాదరావు వైసీపీకి రాజీనామా చేసి శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో సైకిల్ ఎక్కారు. జడ్పీ చైర్మన్ రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నారు. రాజీనామాలు చేస్తున్న వైసీపీ నేతలు జనసేన, టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నా వీరిని బుజ్జగించేందుకు వైసీపీ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. 7లో

ఏలూరు, పశ్చిమ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

» ఏలూరు అధ్యక్షుడిగా రాజనాల రామ్మోహన్.. పశ్చిమ గోదావరికి పాతపాటి హరికుమార్‌రాజు

7

ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో వివాదం

మూడు నెలల తర్వాత హత్య

వర్షాలతో విద్యుత్ అధికారుల అప్రమత్తం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 8: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారనుందని ఐఎండీ వెల్లడించింది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో సోమ, మంగళ వారాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొన్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. దీనితో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సేలందించేందుకు అవసరమైన యంత్రాగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకుంటున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పిసాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు తెలియజేసి పరిష్కారం పొందవచ్చునని ఆయన సూచించారు.

విద్యుత్ శాఖ సూచనలు

- తుఫాన్ వేళ భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- తుఫాన్ సమయంలో మీ ఇంటి గృహోపకరణాలు స్విచ్‌లను ఆఫ్‌మోడ్‌లో ఉంచాలి.
- ఇంటి లోపల కరెంట్ స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదు.
- చిన్న పిల్లలను కరెంట్ వస్తువులను తాకనీయ వద్దు
- ఇంటి సర్వీస్ వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వెంటనే తెలియజేయాలి. వాటిని ఎట్టి పరిస్థితులలోను తాకరాదు.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంట్ పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి ఆవరణలో ఉన్న నీళ్ల మోటారు, నీటి పంపులను, వాటికి ఉన్న కరెంటు వైర్లను , జాయింట్లను తాకరాదు.
- గాలి వాన సమయంలో కరెంటు లైన్ కింద నిలబడటం, కూర్చోవటం చేయరాదు.
- ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టరు) తెగి పడి ఉంటే దానిని విద్యుత్ సరపరా ఉన్నదిగా పరిగణించి సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని నేరుగా తాకరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి తెలియజేయాలి.
- మోటార్ స్టార్టర్లు, మోటార్లు వర్షం నీటిలో మునగటం, పూర్తిగా తడవటం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కావున రైతులు జాగ్రత్తగా ఉండాలి
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన ఎడల ఆ వ్యక్తి గాని, విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదు. వెంటనే దగ్గరలో విద్యుత్ అధికారి/ సిబ్బందికి తెలియజేయాలి.
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912కు కాల్ చేయాలి.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు సత్కారం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8: తాడేపల్లిగూడెంలో అపుస్మా జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసి ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ధర్మరాజు పాల్గొని అపుస్మా అందించే సేవలను కొనియాడారు. అనంతరం అపుస్మా ప్రతినిధులు సమస్యలపై అందించిన వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, కార్యదర్శి ఏవీవీ సుబ్బరాజు, కోశాధికారి కె.రామకృష్ణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో ఆర్వోబీ పనులు


ఆర్వోబీని పరిశీలిస్తున్న అధికారులు

ఉండి, సెప్టెంబరు 8: ఉండిలో నిలిచి పోయిన ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్టు ఆర్వోబి అధికారులు వెల్లడించారు. 2020లో చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఈ పనులపై ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఇటీవల కేంద్ర, రాష్ట్ర మంత్రులు దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఫైల్ కదలిక ఏర్పడింది. ఉండిలోని రైల్వేగేటు వద్ద నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి పనులు తొలుత వేగంగానే సాగాయి. తదుపరి కరోనా సమయంలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అధికారుల బృందం శనివారం ఉండిలో ఆర్వోబిని పరిశీలించారు. వర్షాలు తగ్గిన తక్షణమే పనులు చేపట్టి పూర్తిచేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

మౌనికకు ఆరోగ్యశ్రీలో వైద్యం



బుట్టాయగూడెం, సెప్టెంబరు 8: కొండరెడ్డి బాలిక గోగుల మౌనికకు ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తున్నట్లు డిప్యూటీ డిఎం&హెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు తెలిపారు. లంకపాకల గ్రామానికి చెందిన గోగుల మౌనిక లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుచూ గత బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు అనంతరం బాలికల గుండెచుట్టూ కండరాలు పెరగటంతో ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని అందుకు సుమారు 5 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులకు చెప్పడంతో కూలీ చేస్తేగాని పూటగడవని ఆదివాసీ కొండరెడ్ల బిడ్డను బ్రతికించమని ఆరోగ్యశ్రీలో వైద్యం అందించాలని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ద్వారా ప్రభుత్వాన్ని, ఐటీడీఏ అధికారులను వేడుకున్నారు. కథనంపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు మౌనికకు మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎం&హెచ్‌వోను ఆదేశించారు. మౌనిక తల్లిదండ్రులకు ఆరోగ్యశ్రీ ఉన్నా కార్డులో మౌనిక పేరు ఎక్కకపోవడంతో ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం చేయడానికి ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించలేదు. దీనితో జిల్లా అధికారులు ఆరోగ్యశ్రీ జిల్లా అధికారితో మాట్లాడి పాప పేరును కార్డులో చేర్చి యుద్ధ ప్రాతిపదికన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.



ఎయిర్‌పోర్టుకు స్థలం సేకరిస్తే సహకరిస్తా

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, సెప్టెంబరు 8: భీమవరం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హామీ ఇచ్చారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఛాంబర్ తరుపున ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. ఎమ్మెల్యే అంజిబాబు ఎయిర్ పోర్టు విషయాన్ని ప్రస్తావించారని అందుకు దాదాపు 600 ఎకరాలు అవసరం ఉంటుందని సేకరణ చేస్తే తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ పట్టణానికి ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం 600 ఎకరాలు భూమి సేకరించి అందజేయడానికి సిద్ధమని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు భీమవరానికి సరికొత్త వాణిజ్య, పారిశ్రామిక వృద్ధికి దారి తీస్తుందని అన్నారు. అదే విధంగా రింగ్ రోడ్డు నిర్మాణ విషయంపై దృష్టిపెడతామని అన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ అందరం కలసి ఎయిర్ పోర్టు నిర్మాణానికి కృషిచేద్దామని అన్నారు. అనంతరం ఛాంబర్ తరుపున కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లను సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), నార్ని తాతాజీలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామ్మోహనరావు(రాంపండు), సంగడి వీర వెంకట శివ సత్యనారాయణ(బుజ్జి), మానేపల్లి సూర్యనారాయణగుప్త, కనుమూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీపై పసుపు పతాక

- టీడీపీలో చేరేందుకు చైర్మన్ ఘంటా పద్మశ్రీ సుముఖం
- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరాలని తాజాగా నిర్ణయం
- మరికొందరు జడ్పీటీసీల్లోను భారీ కదలిక
- రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమక్షంలో జడ్పీ చైర్మన్ భర్త ప్రసాదరావు చేరిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అధికారంలో ఉన్నన్నాళ్ళు వైసీపీ నాయకులు తొడలు చరిచారు. ప్రత్యర్థి పార్టీలను అణగతొక్కేందుకు అక్రమ కేసులతో చెలరేగిపోయారు. అంతకంటే మించి తామే సర్వస్వం అన్నట్టు వ్యవహరించారు. ఇక ఏ పార్టీకి మనుగడ లేదంటూ గప్పాలు పలికారు. తీరా గడిచిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాజయం ఎదురైంది. గోదావరి జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో తుడిచి పెట్టుకుపోయారు. ఆఖరుకి పార్టీ ముఖ్యనేతలంతా ఇప్పటికే బైబై చెప్పేశారు. మిగిలిన ఇంకొందరు మరికొద్ది రోజుల్లోనే వైసీపీకి బిగ్ షాక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా జిల్లా పరిషత్ వ్యవహారం గత కొద్ది రోజులుగా అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ దంపతులు వైసీపీపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. నేరుగా జనసేనలో కలిసేందుకు అడుగులు వేశారు. జనసేన ముఖ్య నేతలతో సంప్రదింపులు నెరపారు. ప్రత్యేకించి తాము జనసేన పార్టీలో చేరడానికి సుముఖంగా ఉన్నామని అంగీకరిస్తే పవన్‌కళ్యాణ్ సమక్షంలోనే పార్టీలో చేరతామని పదేపదే లీకేజీలు ఇస్తూ వచ్చారు. సోషల్ మీడియాలో జడ్పీ చైర్మన్ దంపతుల వ్యవహారం చిలువలు పలువలుగా ప్రచారమైంది. ఇంతకుముందే జడ్పీ చైర్మన్‌కి ఇప్పటి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా మారింది. దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి జడ్పీ చైర్మన్ దంపతులు అత్యంత సన్నిహితం. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్‌కు వ్యతిరేకంగా వీరు పదేపదే విమర్శలు చేయడమే కాకుండా ఆయనపై కేసులకు ప్రయత్నించారు. దీనిని అప్పట్లోనే ప్రభాకర్ ధీటుగా ఎదుర్కొన్నారు. ఇప్పుడు మారిన రాజకీయ పరిణామాల క్రమంలో తొలుత జనసేనలో చేరతామన్న ఆలోచన విమరించుకున్న జడ్పీ చైర్మన్ దంపతులు టీడీపీలో చేరాలని నిర్ణయించి ఆ మేరకు కొందరు నేతల ద్వారా టీడీపీ పెద్దలకు సమాచారం పంపారు. తాము స్వచ్ఛందంగా పార్టీలో చేరతామని సంకేతాలు ఇచ్చారు. ఈ మధ్యకాలంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులతోపాటు మరికొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, దాదాపు ఏలూరు కార్పొరేషన్ టీడీపీ వశమైంది. ఇప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్ పార్టీలో చేరిన పక్షంలో జడ్పీ తమ ఆధీనంలోకి వస్తుందని టీడీపీ భావించింది. దీనికి అనుగుణంగానే జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతోను పార్టీ సీనియర్లు శనివారం చర్చించారు. జడ్పీ చైర్మన్ పద్మశ్రీ భర్త వైసీపీ నేతను పార్టీలో చేర్చుకోవడానికి అంగీకరిస్తూ ఈ ప్రక్రియను దగ్గరుండి చూడాల్సిందిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును ఆదేశించారు. ఇప్పటికే వైసీపీకి ఘంటా ప్రసాదరావు రాజీనామా చేశారు. ఆయన బాధ్యత వహిస్తున్న వైసీపీ బీసీ విభాగం అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే టీడీపీలో చేరేందుకు నిర్ణయించడంతో ఘంటా ప్రసాదరావును వెంటపెట్టుకుని విశాఖపట్టణంలో ఉన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్దకు గన్ని తీసుకువెళ్ళారు. అక్కడే ప్రసాదరావుకు తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొన్ని విషయాలపూ పూర్తిగా ఆరా తీసినట్టు సమాచారం. ముందస్తుగా జడ్పీ చైర్మన్, ఆమె భర్తను పల్లా శ్రీనివాసరావు వద్దే పార్టీలో చేరాలని టీడీపీ కోరగా జడ్పీ చైర్మన్ హోదాలో తాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుటే టీడీపీలో చేరతానని సంకేతాలు ఇచ్చారు. దీంతో జడ్పీ చైర్మన్‌ను ముఖ్యమంత్రి సమక్షంలోనే టీడీపీలో చేరేందుకు తేదీలను ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే నాలుగేళ్ళు తరువాతేనని అధికారిక నిబంధన ఉంది. జిల్లా పరిషత్‌లో వైసీపీదే ఏకపక్ష బలం 46 అయినప్పటికీ మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జడ్పీ సభ్యులు కూడా ఇప్పటికే అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆచంట జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ, వీరవాసరం జడ్పీటీసీ స్థానాన్ని జనసేన దక్కించుకున్నాయి. ఈ రెండూ మినహా మిగిలిన స్థానాలన్నింటిలోనూ వైసీపీదే ఆధిపత్యం. ముందుగా జడ్పీ చైర్మన్ పార్టీ నుంచి పక్కకు తప్పుకుంటే ఆ బాటలోనే ప్రయాణించేందుకు ఇంకొందరు సంసిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తెలుగుదేశం జడ్పీ చైర్మన్‌ను పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించింది.




జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

అందరినీ ఒప్పించి మెప్పించి..

జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులను పార్టీలో చేర్చుకునే విషయంలో తెలుగుదేశం ఆచితూచి అడుగులు వేసింది. ప్రత్యేకించి ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్పీటీసీలు కొందరు టీడీపీలో చేరేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు సానుకూల సంకేతాలు పంపారు. వైసీపీ ఆధీనంలో జిల్లా పరిషత్ కొనసాగినా విధులు.. నిధుల విషయంలో జడ్పీటీసీలు చాలా కాలం నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరందరినీ ఒక గాటన తెచ్చేందుకు వేచి చూసిన తెలుగుదేశం తాము ఊహించినట్టుగానే జడ్పీ చైర్మన్ ఈ వైపు తొంగి చూడడంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకున్నారు. సమాంతరంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోను, పార్టీ ప్రముఖులు కొందరు ముందస్తుగా చర్చించిన తరువాతే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

కొంప కొల్లేరు

వరద నీటిలో కొల్లేరు వాసుల అవస్థల దృశ్యాలు


కడిమికుంటలో ఇళ్ళల్లోకి చేరిన నీరు


చర్చిలోకి చేరిన వరద


పెనుమాకలంకలో పసి పిల్లలతో మహిళలు


పడవలో సరుకులు తెచ్చుకుంటున్న మహిళలు


పెనుమాకలంక స్కూల్‌లోకి చేరిన చెరువు నీరు


పెనుమాకలంకను చుట్టుముట్టిన కొల్లేరు

ఏలూరు, పశ్చిమ జిల్లాల

కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం


రామ్మోహన్

ఏలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నేత రాజనాల రామ్మోహన్‌ను ఏఐసీసీ నియమించింది. ఉమ్మడి పశ్చిమలో కాంగ్రెస్ వర్గాల్లో సీనియర్ అయిన రామ్మోహన్ ఇంతకు ముందు కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పక్షాన విశేష కృషి చేశారు. షర్మిల కూడా ఆయన పనితీరు పట్ల ఇంతకు ముందే సంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొంటూ ఏఐసీసీ నేతలు సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గేలతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపినట్టు రామ్మోహన్ తెలిపారు.


హరికుమార్ రాజు

గణపవరం: పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా పాతపాటి హరికుమార్‌రాజు నియమితులయ్యారు. పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం హరికుమార్‌రాజు నియామక ఉత్తర్వుల కాపీలను స్థానిక విలేకర్లకు అందజేశారు. 1990లో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా రాజకీయ అరంగేట్రం చేసిన హరికుమార్‌రాజు పార్టీ విధేయునిగా ఉంటూ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ఆయన సేవలందించారు. జిల్లా అధ్యక్షుడి పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేజీ.వేణుగోపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెంకు చెందిన మార్నిడి బాబ్జిని నియమిస్తూ పార్టీ ఆదేశాలు విడుదల చేసింది. బాబ్జి నరసాపురం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తాడేపల్లిగూడెం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

బియ్యపు గింజపై వినాయక ప్రతిమ



నరసాపురం, సెప్టెంబరు 8: రుస్తుంబాదాకు చెందిన చిత్రకారుడు, గిన్నిస్ వర్డల్ రికార్డు గ్రహీత కొప్పినీడి విజయమోహన్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని ఒక బియ్యపు గింజపై సూక్ష్మదర్శినిని ఉపయోగించకుండా వినాయక రూపాన్ని చెక్కాడు. కేవలం గంట వ్యవధిలోనే గింజను గణనాధుడిగా మార్చాడు. అతని ప్రతిభను పలువురు అభినందించారు.

టిడ్కో సముదాయాల వద్ద విషసర్పాలు



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8: ఎల్. అగ్రహారం టిడ్కో ఇళ్ల సముదాయాల్లో విషసర్పాలు ఆ ప్రాంత వాసులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల మధ్యలో పేరుకు పోయిన తుప్పల మాటున భారీ విష సర్పాలు వర్షాలకు బయటకు వచ్చి పైపులైన్‌లకు చుట్టుకోవడంతో ప్రజలు హడలిపోతున్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



భీమవరం క్రైం, సెప్టెంబరు 8 : భీమవరం - పెన్నాడ రైల్వే స్టేషన్ల సమీపంలో భారతీయ విద్యాభవన్స్ స్కూల్ వెనకాల రైలు పట్టాలపై ఒక యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక కముజువారిపాలెంకు చెందిన కముజు బాలాజీ (22) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలాజీ శనివారం రాత్రి రైలు కిందపడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

వాగులో పడి అధ్యాపకుడి మృతి

లింగపాలెం, సెప్టెంబరు 8: మండలంలోని తువ్వచిలుక రాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు చాత్రాయి మండలం తుమ్మగూడెం వాగులో పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి సూర్యప్రకాష్ (35) తుమ్మగూడెం గ్రామానికి వెళ్తూ మార్గమధ్యలో వాగు దాటుతుండగా నీటి ప్రవాహానికి మోటారు సైకిల్‌తో పాటు కొట్టుకుని పోయి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు ఏలూరు ఎన్నారై కాలేజీ లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య కుమార్తె ఉన్నారు.

కాల్వలో కాలు జారిపడి ఆక్వా రైతు..

పోడూరు, సెప్టెంబరు 8: ప్రమాదవశాత్తు కాలు జారిపడి పడి ఆక్వారైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వద్దిపర్రు శివారు మొండిగర్వుకు చెందిన గెద్దాడ వెంకట ప్రసాదు(40) శుక్రవారం రాత్రి తండ్రి వీరభద్రరావును చెర్వు వద్ద పెట్టి ఇంటికి బయలుదేరి వెళ్లాడు. మరుసటిరోజు శనివారం ఉదయం తండ్రి వీరభద్రరావు ఇంటికి వస్తూ నక్కల డ్రెయిన్ వద్ద తన కుమారుడు వెంకట ప్రసాదుకు చెందిన బైకు, చెప్పులు ఉండటంతో అనుమానం వచ్చి ఇంటికి ఫోన్‌చేసి కోడలను దివ్యను ఆరా తీశాడు. కుమారుడు రాత్రి ఇంటికి రాలేదని చెప్పడంతో స్థానికులకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది నక్కల కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వెంకట ప్రసాదు మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల చెరువులో పడి ఒకరు..

ఆకివీడు, సెప్టెంబరు 8 : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వ్యక్తి శవమై కనిపించాడు. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్త చెరువు కొత్తపేటకు చెందిన దాసరి వెంగళరావు (58) ఈ నెల 6న రాత్రి భోజనం చేసి బయటకు తిరిగి వెళ్ళి రాలేదు. 7న గ్రామంలోని చేపల చెరువులో పడి చనిపోయి ఉన్నట్లు కుమారుడు దాసరి కుమార్‌బాబు గుర్తించి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేర ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

కార్మికుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8 : టైల్స్‌పని చేస్తున్న ఒక కార్మికుడు తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు పత్తేబాద శివాలయం వీధికి చెందిన ముళ్ళగిరి నరేష్ (38) కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని భార్య కొన్నేళ్ళ క్రితం వదిలేసింది. టైల్స్ పని చేస్తూ ఉంటాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. పక్కింటి వారికి ఆ ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లడంతో కిటికిలోనుంచి చూడగా అతని మృతదేహం కనిపించింది. ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మృత దేహం కుళ్ళిపోయి, ఉబ్బిపోయి ఉంది. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యను గాయపరిచిన భర్తపై కేసు

ఉండి సెప్టెంబరు 8: కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 6వ తేదీన చెరుకువాడలో ఇంటి వద్ద వున్న తనని తన మేనత్తని భర్త మంగన్న అతని స్నేహితుడి సత్యమూర్తితో కలిసి గాయపరిచినట్లు తెలిపారు. భార్య అపర్ణ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నజీరుల్లా తెలిపారు.

కోడి పందేల్లో 9 మంది అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలో కోడి పందేలు శిబిరంపై రూరల్ ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ కోడి పందేలు ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కోడిపుంజులు, 8 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో వివాదం

మూడు నెలల తర్వాత హత్య




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) కోటయ్య (ఫైల్)

ముదినేపల్లి, సెప్టెంబరు 8 : పాత కక్షల నేపథ్యంలో ఊటుకూరు గ్రామంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిని అతి కిరాతకంగా నరికి చంపాడు. వినాయక చవితినాడు జరిగిన ఈ ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లిలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... ఊటుకూరులో ఈ ఏడాది మేలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటుతోపాటు బాణసంచా పేల్చిన విషయంలో నిర్వాహకులు గూడవల్లి శ్రీను బాబు కుటుంబీకులకు, మరి కొందరికి సమీప బంధువైన పోసిన బాలకోటయ్య కుటుంబీకులకు మధ్య గొడవలు జరిగాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగిన మరుసటి రోజు తిరిగి ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగగా, బాలకోటయ్య కుటుంబీకులు గూడవల్లి శ్రీను బాబు కుటుంబీకులు నలుగురిని కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై అప్పట్లో ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి బాలకోటయ్య, అతని భార్య కుమారులను అరెస్టు చేయగా, 31 రోజుల రిమాండ్ అనంతరం జూన్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య కక్షలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెం నుంచి బైక్‌పై ఊటుకూరు వస్తున్న బాలకోటయ్య (54)ను కొందరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. హతుడి భార్య గాయత్రి, కుమారుడు చైతన్య ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకునే సరికే బాలకోటయ్య మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది.

పాత కక్షలతోనే హత్య..

తమ మేనమామ కుటుంబంతో ఉన్న పాత కక్షల కారణంగానే తన తండ్రి బాలకోటయ్య హత్య జరిగిందని హతుడి కుమారుడు పోసిన చైతన్య ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రిని గూడవల్లి శ్రీను బాబుతోపాటు శ్రీను, శివాజీ, మహంకాళిరావు, పద్మ, జ్యోతి, ప్రశాంత్ కుమార్, ఉదయ సాయి, నాగరాజు, రాజేష్ హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనా స్థలాన్ని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు పికెట్ ఏర్పాటు

ఊటుకూరు గ్రామం భయం గుప్పెట్లో ఉంది. శనివారం గ్రామానికి చెందిన పోసిన బాలకోటయ్య (54) ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురికావటం, ఇందుకు తమ బంధువులే పాత కక్షలతో హత్య చేశారని హతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఇరు వర్గాల మధ్య మరింత కక్షలు పెరిగి పరిస్థితి ఎటు దారి తీస్తుందోనన్న భయం గ్రామస్థుల్లో కలుగుతున్నది. ఊటుకూరు గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకట్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. హత్యకు సంబంధించిన వివరాలను ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌లు ఆదివారం సేకరించాయి. పోలీసు జాగిలాలు నేర స్థలం నుంచి ఊటుకూరు గ్రామం వైపు వెళ్లి తిరిగి నేరస్థలానికి వచ్చాయి.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కృష్ణాయపాలెంలో అశ్లీల నృత్యాలు చేయడంపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అశ్లీల నృత్యాలు చేసిన మహిళా వేషధారులను అదుపులోకి తీసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఉండి: అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎండి.నజీరుల్లా తెలిపారు. పెదపుల్లేరు గ్రామంలో గత నెల 15వ తేదిన లక్ష్మీవారాల పండుగను పురస్కరించుకుని రాత్రి 11గంటల సమయంలో గ్రామానికి శివారున ఫ్లడ్‌లైట్లు వెలుతురులో ఇరువురు ట్రాన్స్‌జెండర్లను తీసుకు వచ్చి అశ్లీల నృత్యాలు చేయించారు. ఈ ఘటనలో 8 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విజిలెన్స్ విచారణ జరపాలి



లోయేరు పనుల్లో అవినీతిని ఏలూరు రేంజ్ ఐజీకి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, సెప్టెంబరు 8 : గత వైసీపీ పాలకులు లోయేరు పనుల పేరుతో జరిపిన భారీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాల్సిందిగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. వరద ప్రాంతాలను పరిశీలనకు వచ్చిన ఐజీని కలిసి ఎమ్మెల్యే లోయేరు పనుల్లో జరిగిన అవినీతిని వివరించారు. లోయేరు పనులు పేరుతో డ్రెయిన్లు మరమ్మతులు చేస్తున్నట్లుగా వైసీపీ నాయకులు నటించి ఎక్కడా పనులు చేపట్టకుండానే పనులు పూర్తయినట్లు దాదాపు రూ.80 లక్షలు ప్రభుత్వ సొమ్మును కాజేయటానికి బిల్లులు రికార్డింగ్ చేయించుకుని భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

కలకుర్రు, మానూరులో చింతమనేని పర్యటన

ఏలూరు రూరల్, సెప్టెంబరు 8: ఏలూరు రూరల్ మండలం కలకుర్రు, మానూరులో అధికారులతో కలిసి ప్రభాకర్ పర్యటించారు. కాలినడకన పర్యటిస్తూ వరద ముంపునకు గురైన ఇళ్లను స్వయంగా పరిశీలించారు. బాధితులకు నిత్యావసర సరుకులు అందించి వారికి అండగా ఉంటామన్నారు. అనంతరం కొల్లేరులో వరద ప్రవాహం వల్ల బోటుపై ప్రయాణిస్తూ వరద ముంపు గ్రామాలను స్వయంగా పరిశీలించారు. తగిన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నంబూరి నాగరాజు, నేతల రవి, బండి ప్రణవి, పలువురుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు న్యాయం చేయండి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 8 : జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం) స్కీం కింద పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు గత వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిదిద్దే చర్యలను చేపట్టాలని ఏపీఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర చైర్మన్ దయామణి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి పంపిన లేఖలను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల వల్ల 2022లో ప్రకటించిన 11వ పీఆర్సీని కూడా కోల్పోయామని, దీనిపై జేఏసీ చేసిన పోరాటాలకు స్పందించి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ విస్మరించారన్నారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ రైజ్ చేసి ఉద్యోగభద్రత కల్పించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు రీడిప్లాయిఎంట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇక మీదట స్టాఫ్ నర్సుపోస్టులన్నింటినీ శాశ్వత ప్రాతిపదికన మాత్రమే నియమించాలని డిమాండ్ చేశారు.

ఇఫ్-2 ప్రాంతీయ శిక్షణ తరగతులు

ఏలూరు రూరల్, సెప్టెం బరు 8: ఏలూరు మార్కెట్ యార్డులో ఆదివారం ఇఫ్-2 ప్రాంతీయ తరగతులను మార్కెట్ యార్డు హమాలీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రెడ్డిఅప్పలనాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయటం కోసం ప్రతి కార్మికుడు నాయకుడిగా ఎదగాలన్నారు. ఈ శిక్షణలో కొత్త క్రిమినల్ కోడ్స్ ప్రజలపై వాటి ప్రభావ అంశంపై హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ ఇఫ్-2 జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.అప్పా రావు, వై.శ్రీనివాసరావు, ఎస్.రామ్మోహన్ ప్రసంగించారు.

ఎర్రకాలువ జలాశయానికి భారీగా వరద నీరు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 6 : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. ఆదివారం గంటకు 3,900 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతుండగా 3,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డీఈ రాంబాబు తెలిపారు. దిగువకు విడుదల చేసిన వరద నీరు తో పంగిడిగూడెం నుంచి రాజవరం వెళ్ళే రహదారిపై ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ప్రయాణీకులు వెళ్ళవద్దని అధికారులు తెలియచేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు కొంపెల్లి తాయారు వైసీపీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఆదివారం లేఖను విడుదల చేశారు. తన వ్యక్తిగతం కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు లేఖను పంపించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** కూరగాయల ధరలు పెంచవద్ద ప్రభుత్వం రైతు బజార్లకు ప్రత్యేక ఆదేశాలు ఇవ్వ డంతో ధరలు యధావిధిగా కొనసాగుతున్నాయి. ఆదివారం రైతు బజారులో కిలో టమోటా రూ. 32, వంకాయలు రూ.50, బెండకాయలు రూ.44, మిర్చి రూ.28, కాకర రూ.24, బీర రూ.56, క్యాబేజి రూ.28, క్యారెట్ రూ.40, దొండ రూ.38, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.58, గోరుచిక్కుళ్ళు రూ.38, చేమదుంప రూ.48, బీట్‌రూట్ రూ.38, కీరదోస రూ.40, బీన్స్ రూ.96, అల్లం రూ.160, క్యాప్సికం రూ.64, చిలకడదుంప రూ.50, ఆకాకర రూ.160 చొప్పున విక్రయిస్తున్నారు.
- **ఏలూరు టూ టౌన్ :** విజయవాడ వరద బాధితులకు ఏడు రోజుల నుంచి రోజుకు నాలుగు లక్షల ఆహార పొట్లాలు పంపించినట్లు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. ఆదివారం ఆహార పొట్లాలు సరఫరా చేసే లారీని జెండా ఊపి ప్రారంభించారు.
- **ఏలూరు టూ టౌన్ :** పశు సంవర్ధక శాఖ కొల్లేరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జేడీ డాక్టర్ నెహ్రూ బాబు తెలిపారు. జిల్లాలో 30 గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు.
- **టి.నరసాపురం:** వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ముందు స్థానిక వీఆర్‌వోకి తెలపాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, ఎస్‌హెచ్‌ఓ జయ బాబు సూచించారు.
- టి.నరసాపురం గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం నిర్వహణ కమిటీ సభ్యులు ఆదివారం సుమారు 1200 మందికి అన్న సమారాధన నిర్వహించారు. సీహెచ్.యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.
- **పెదవేగి :** స్థాపిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు.
- **నిడమర్రు :** భువ్వనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 1995 నుంచి 2000 వరకు సర్పంచ్‌గా పని చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 20 ఏళ్లుగా గ్రామదేవత శ్రీవడలమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఈయన ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావుకు మామ.
- **భీమడోలు :** ఉంగుటూరు నియోజకవర్గంలో బీజేపీ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని ఏలూరు జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శరణాల మాలతీరాణి పిలుపునిచ్చారు. నాయకులు ప్రవీణ్‌పటేల్, ఎం. ధర్మారావు, ఎ.శోభారాణి, వి.కపిరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సం స్థ సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వ ర్యంలో మంగళవారం భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి ఘంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.
- స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం నిర్వహించినప అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవానికి వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు సీహెచ్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీఎం శ్రీనివాస్, విద్యాశాఖాధికారులు, వెలుగు సభ్యులు, మహిళా సంఘ నేతలు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** విజయవాడ వరద బాధితులకు నేకూరి సోషల్ సర్వీస్ సంస్థ (నారాయణపురం) ఆదివారం దాతల సహకారంతో పాలు, రొట్టెలు, రస్కులు, బిస్కెట్లు, మందులు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు, లక్ష్మణరావు, సుధీర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.
- నల్లమాడు-యర్రమిల్లిపాడు మధ్య గల చెర్వు తూము వద్ద లీకులను గుర్తించిన సర్పంచ్ జి.రాము, తహసీల్దార్ బి.దుర్గా ప్రసాద్ వీఆర్‌వోలు సిబ్బందితో కలిసి కాంక్రీటుతో నివారణ చేయించారు.
- **పెదపాడు :** వసంతవాడలోని రిలీఫ్ సెంటర్‌ను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి తూలిక విశ్వనాధ్ ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో 400 మంది నిర్వాసితులు పునరావాస కేంద్రాల వద్ద ఉన్నారన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ జిల్లా పరిశీలకులు వెంకట్‌ప్రసాద్, ఇంచార్జి తహశిల్దారు ప్రసాద్‌బాబు, ఇవోపీఆర్డీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **పోలవరం :** భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాల ప్రజలు, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచించిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

ఎడతెరిపి లేని వర్షం

» పల్లపు ప్రాంతాలు జలమయ్యం » స్తంభించిన జనజీవనం



ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 8 : అల్పపీడన ద్రోణితోపాటు బంగాళఖాతంలో వాయుగుండం కారణంగా ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం నుంచి ఎడతేరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ముసురు పట్టడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండవాగులు పొంగుతున్నాయి. వరద ఉధృతి అంతగా లేకపోవడంతో జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకర స్థాయికి దిగువనే వాగులు ప్రవహిస్తున్నాయి.

● చింతలపూడి : రెండు రోజులుగా చింతలపూడి పరిసరాల్లో ఎడతెరిపిలేని వర్షం పడుతోంది. ఇప్పటికే చెరువుల నిండి అలుగులు పడుతున్నాయి. ఇప్పుడు ఏ కొద్ది వర్షం పడినా అలుగుల నుంచి అదనపు నీరు వాగుల ద్వారా పొంగి ప్రవహిస్తున్నాయి. మెట్ట ప్రాంతంలోని వరి పొలాల్లో కూడా వర్షపు నీరు చేరింది. అయినా ఎక్కడా ముంపు బెడదలేదు. ఇది ఇలా ఉంటే అధిక వర్షాలు వల్ల జ్వరాలు ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు.

● కొయ్యలగూడెం : మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు డ్రైన్లు పొంగి పొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కన్నాపురంలో కాల్వలు పొంగి పొర్లుతున్నాయి.

● పోలవరం : మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరపిలేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. గూటాల పంచాయతీలో ఏటిగట్టు వెంబడి ఉన్న నివాసాలు, హైస్కూలు ఎదుట కాలనీ, కొత్తపట్టిసీమ పంచాయతీలో ఏటిగట్టు వెంబడి నివాసాలు, పట్టిసీమ పంచాయతీలో వీరభద్రపురం కాలనీ, పోలవరం పంచాయతీలో నూతనగూడెం, బాపూజీ కాలనీ, కొత్తపేట కాలనీల నివాసాల చుట్టూ వర్షపు జలాలు చేరి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు.

● ఉంగుటూరు : మండలంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తూనే ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయానికి మండలంలో 17.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8: ఎడతెరపి లేని వర్షంతో మండల ప్రజలు ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగకుండా వాన దంచి కొట్టింది. దీంతో క్షేత్రానికి వచ్చిన భక్తులతో పాటు, స్థానికులు ఇబ్బందుల పాలయ్యారు. వర్షం కారణంగా భక్తుల రద్దీ క్షేత్రంలో కాస్త తగ్గింది. వచ్చిన కొద్ది మంది స్వామివారి దర్శనానికి గొడుగులు, తుండ్లు వంటి ప్రత్యామ్నాయాలను వాడగా మరికొందరు తడుచుకుంటూనే వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పొంగుతున్న తమ్మిలేరు



ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో ఉన్న తమ్మిలేరు జలాశయం నుంచి ఆదివారం మధ్యాహ్నం 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఆ నీరు ఆదివారం సాయంత్రానికి ఏలూరుకు చేరుకుంది. దీంతో ఏలూరు-శనివారపుపేట కాజ్‌వేపైకి పొంగిపొర్లడంతో రాకపోకలు నిషేధించారు. సోమవారం కూడా ఈ వరద ప్రవాహం కొనసాగుతుందని ప్రకటించారు. మరోవైపు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి ఈ ప్రాంతాలను పరిశీలించి పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారను. ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏలూరు డీఎస్పీకి సూచించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.

వర్షాలకు కోతకు గురైన రహదారులు



కోతకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ

కామవరపుకోట, సెప్టెంబరు 8 : ఉప్పలపాడు గ్రామం వద్ద ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి కోతకు గురైంది. రోడ్డుకు గండిపడే అవకాశం ఉండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు సమాచారం అందచేయడంతో ఆయన మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ బృందాన్ని అలర్ట్ చేశారు. ఈ బృందం రోడ్డు కోతకు గురికాకుండా జేసీబీ ద్వారా మట్టి గట్లు వేసి నీరు మళ్ళించారు. తహసీల్దార్ జి.ఎలీషా, ఆర్‌అండ్‌బీ వర్క్ ఇనస్పెక్టర్ తాతేశ్వరరావు, వీఆర్వోలు ఎండీ మెహబూబ్, రాటాలు, స్థానిక నాయకులు జి.బాబ్జి, టీడీపీ నేతలు డి.నాగు, సి.భాస్కర్, ఎం.విద్యాధరరావు, తదితరుల పర్యవేక్షణలో పనులు కొనసాగడంతో ప్రమాదం తప్పింది.

ముంపు బారిన కొల్లేరు పొలాలు



అడవికొలను కొల్లేరు ఏరియాలో వరద నీటిలో పొలాలు

నిడమర్రు సెప్టెంబర్ 8 : వర్షాలకు కొల్లేరు నిండు కుండలా మారిపోయింది. దీంతో వరద ముంపు పొంచి ఉండడంతో రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడూ స్థానికంగా నీటి పరిస్థితిని పరిశీలించి అధికారులకు తెలియజేస్తున్నారు. కొల్లేరు ఆయకట్టు ప్రాంతంలో, నిడమర్రు వెంకటాపురంలో, 5వ కాంటూరు ప్రారంభంలో గల పొలాలు పూర్తిగా నీట మునిగి పుంతరోడ్ల మీద ఒక అడుగు మేర నీరు ప్రవహిస్తుందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. అలాగే అడవికొలను చానమిల్లి ఎల్లమ్మ చెరువు రోడ్డులో సాగు భూమి పూర్తిగా నీట మునిగిందని, ప్రస్తుతం గ్రామాలకు మూడు కి.మీ దూరంలో వరద ముంపు వచ్చిందన్నారు. నీరు కిందకు పూర్తిస్థాయిలో పోకపోవడంతో వరద నీరు పొడుస్తుందని స్థానికులు తెలియజేస్తున్నారు. అడవికొలను నీటి సంఘం అధ్యక్షులు కోటిపల్లి రాధాకృష్ణ, విఆర్ఓలు సాయిగోపాల్, మనోజ్, వీఆర్‌వోలు హనుమంతు, రమేష్ పొలాలను పరిశీలించారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ



ఎమ్మెల్యే ధర్మరాజుకు రూ.లక్ష చొప్పున విరాళం అందజేస్తున్న ఉంగుటూరు మండలం నాచుగుంట నాయకులు

పెదవేగి, సెప్టెంబరు 8 : దుగ్గిరాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జయపురానికి చెందిన నెక్కంటి కల్కీశ్వరరావు వరద బాధితుల కోసం రూ.లక్షలను, పెదపాడుకి చెందిన గుండిరెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో గండిచెరువు గట్టుకు చెందిన గ్రామస్తులు రూ.25 వేలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఆదివారం అందజేశారు. సాయం చేయడంలో చేతులు కలిపిన ప్రతిఒక్కరినీ ఎమ్మెల్యే ప్రభాకర్ అభినందించారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, మంచినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : పట్టణ ముస్లిం, మైనార్టీ, జమాతే ఇస్లామీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం వసూలు చేసిన రూ.లక్షా 35 వేల నగదును జమాతే ఇస్లామీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్‌కు ఆదివారం అందచేశారు. జామియా మసీదు పట్టణ ముస్లిం, మైనార్టీలు ఈ నిధుల సేకరణలో పాల్గొన్నట్టు మసీదు కమిటీ కార్యదర్శి జిలానీ తెలిపారు. ముస్లిం నాయకులు ఎండీ అక్తర్‌అలీ, రఫీ, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : నాచుగుంట గ్రామ కూటమి నాయకులు ఇమ్మణ్ణి గంగాధరరావు, పిచ్చుకల వెంకటేశ్వరరావు, నెక్కలపూడి మురళిలు ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున విరాళం అందించారు. అలాగే నీలాద్రపురం ఎస్సీ కాలనీ వాసులు రూ.5,030ల నగదును స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ధర్మరాజుకు అందించారు.

● ద్వారకాతిరుమల : వరద బాధితుల సహాయార్థం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మొడత డకల శ్రీనివాసరావు(ఎంఎస్‌ఆర్) తన కుమారులు సంజీవ్ చౌదరి, ఓంప్రకాష్ చౌదరిలతో కలసి వెళ్లి రూ. రెండు లక్షలు చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8 : వేగవరం శివారులో ఆగిఉన్న లారీని ఢీకొని బూరుగు మోహనకృష్ణ (27) అనే యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేగవరం గ్రామానికి చెందిన మోహనకృష్ణ తాడువాయి గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తు న్నాడు. ఆదివారం జంగారెడ్డిగూడెం వచ్చి తన పని ముగించుకుని తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్ళే క్రమంలో బైపాస్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8 : చక్రదేవరపల్లిలో పేకాట స్థావరంపై లక్కవరం పోలీసులు ఆదివారం దాడి చేసి. రూ.19,390 నగదు స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు.

● బుట్టాయగూడెం : ముప్పినవారిగూడెం శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్దనుంచి రూ.15 వేల ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కళాకారులకు సత్కారం

కామవరపుకోట, సెప్టెంబరు 8 : ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కళాకారుడు దివంగత గరికపాటి రాజా రావు అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం సాయిన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ ఎస్ రాజు కళాకారులను సత్కరించారు. కళా కారు లు టి.విశ్వేశ్వరరావు, పి.నారాయణ, శివదాసు, సీహెచ్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షకు 10 పంచాయతీలు ఎంపిక

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8 : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అందించే రూ.లక్ష ఆర్థిక సాయానికి పది పంచాయతీలు ఎంపికయ్యాయి. సర్పంచ్‌లకు సోమవారం సూర్యకిరణ్ కళ్యాణ మండపంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చేతుల మీదుగా చెక్కులను అందచేయనున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు.

నలుగురు సీఐలు బదిలీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : ఏలూరు రేంజ్‌లో ఉన్న నలుగురు సీఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ లో పనిచేసి ఏలూరు రేంజ్ విఆర్‌కు వచ్చిన సీఐ యుజె విల్సన్‌కు భీమడోలు సీఐగా నియమించారు. ఏలూరు డీసీఆర్బీ సీఐగా పనిచేస్తున్న ఎం.సుబ్బారావును ఏలూరు జిల్లా మహి ళా పోలీస్ స్టేషన్ సీఐగా నియమించారు. ఏలూరు రేంజ్‌లో ఉన్న కె.వెంకటేశ్వరరావును పెదవేగి సీఐగా నియ మించారు. జంగారెడ్డిగూడెం సీఐగా వి.కృష్ణబాబును నియమించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ రాష్ట్ర కార్యవర్గ నాయకుడు టి.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతం పాయకరావుపేట ఏరియాలో పి.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదలకు చనిపోయినవారి కుటుంబాలకు రూ.50 లక్షల ఇవ్వాలన్నారు. నెల రోజులకు సరిపడ నిత్యవసర వస్తువుల ను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వరద బాధి తులను ఆదుకోవాలని పార్టీ విరాళాలు సేకరణకు పిలుపు ఇచ్చామన్నారు. నాయకులు ఎస్.రామ్మోహన్, కేవీ రమణ, టి.బాబురావు, కె.రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన కొంగల చెరువు గట్టు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 6 : కోతకు గురైన కొంగల చెరువు గట్టు పనులను ఇరిగేషన్ అధికారులు ఆదివారం చేపట్టారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జంగారె డ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన కొంగల చెరువు గట్టు కోతకు గురైంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి శుక్రవారం చెరువు గట్టును పరిశీలించి త్వరితగతిన గట్టు పటిష్టతకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దెబ్బతిన్న చెరువు గట్టును జేసీబీతో పూడ్చినట్లు డీఈ రాంబాబు తెలిపారు.

నృత్యశిక్షణ.. చిన్నారులకు గజ్జె పూజ



ఏలూరు రూరల్, సెప్టెంబరు 8: నృత్యా ంజలి కళా నికేతన్ ఆధ్వర్యంలో నాట్యా చార్య గండికోట రాజేష్ నృత్య శిక్షణలో కూచిపూడి, జానపద నృత్యాల్లో శిక్షణ పొందుతున్న 70 మంది చిన్నారులకు ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో గజ్జెపూజ మహోత్సవం నిర్వహించారు. శిక్షణ పొందిన చిన్నారులు కళావేదిపై ప్రదర్శనలకు ముందుగా గజ్జె పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దొరసానిపాడులో ఆదివారం ఆయన రూ.10లక్షలు వ్యయంతో నిర్మించిన నూతన మంచినీటి బోరుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, ఎంఎస్‌ఆర్, కారుమంచి మురళి తదితరులు పాల్గొన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



జీలుగుమిల్లిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు



చింతలపూడి కాపులవారి వీధిలో ఏర్పాటు చేసిన చవితి పందిరి

» వాడవాడలా చవితి పందిళ్లు
» కొలువుదీరిన గణనాథులు
» భక్తిశ్రద్ధలతో పూజలు



ఏలూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటి దంపతులు

ఏలూరు టూ టౌన్/ఏలూరు కార్పొరేషన్/ ఏలూరు రూరల్/ కుక్కునూరు/ పెదవేగి /పోలవ రం/కామవరపుకోట/పెదపాడు/ ఉంగుటూరు /నిడమర్రు/ బుట్టాయగూడెం /జీలుగుమిల్లి/ చింత లపూడి/ కొయ్యలగూడెం, సెప్టెంబరు 8: నియోజ కవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన కూడళ్ళలో పందిళ్ళు వేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపి ణీ చేశారు. స్వామికి ఇష్టమైన ఉండ్రాళ్ళు, పాల పొంగళ్ళు, కుడుములు, పండ్లు, ఫలహారాలు సమర్పించి పూజించారు. ఏలూరులోని పవర్‌పేట విగ్నేశ్వరుని ఆలయంలో వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకశిల విగ్రహంతో కొలువు తీరిన విజయగణపతి ఆలయంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంప తులు పూజలు చేశారు. పవరుపేటలోని విజయ గణపతి స్వామి ఆలయం వద్ద, ఎస్ఎంఆర్ కాలనీలోని విగ్నేశ్వరుడి నగర మేయర్ దంపతులు నూర్జహాన్ ఎస్ఎంఆర్ పెదబాబు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి సతీమణి రేణుక, పార్థసారధి, ఈఓ శ్రీనివాస్, ఎ.వెంకటరమణ, సీహెచ్ శ్రీనివాస్, నాగప్రసాద్, వెంకట్రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. నిడమర్రు, ఉంగుటూరు, జీలుగుమిల్లి మండలాల్లో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలలో సీహెచ్.బాసిరాజు, ఎన్.దొరబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్, బీజేపీ సీనియర్ నాయకులు జి.సత్యనారాయణ జనసేన మండల పార్టీ అధ్యక్షులు పి.రాము, పావని దంపతులు, ఆలయ కమిటీ కె.ధర్మరాజు, సీహెచ్ శ్రీను, పి.ప్రసాద్, ఎస్.సాయి, జి.రమేష్, ఎం.సురేష్, ఉన్నారు. బుట్టాయగూడెం దుద్దుకూరులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రత్యేక పూజలు చేశారు.







నిడమర్రు రథం సెంటర్‌లో గణపతి ఉత్సవాలు, ఏలూరు పవరుపేట మేయర్ నూర్జహాన్ దంపతుల పూజలు, పెదవేగి లక్ష్మీపురంలో పూజలందుకుంటున్న వినాయకుడు

నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోండి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 8: వినాయక విగ్రహాల నిమజ్జనంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై ఆదివారం అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరద నీరు ఎక్కువగా ప్రాంతాల్లో తగ్గిన తరువాత నిమజ్జనం నిర్వహించేలా చూడాలన్నారు. చెరువు, కాలువల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలించాలన్నారు. నిజమజ్జనానికి క్రేన్‌లు, జేసీబీ వంటివి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్పీ దంపతుల పూజలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : నగరంలోపి అమీనాపేట పోలీస్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించగా జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఆయన సతీమణి జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పూజలు నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, స్పెషల్ బ్రాంచ్ ఇనస్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఏలూరు త్రీ టౌన్ ఇనస్పెక్టర్ కోటేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ వైవీ రమణ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : వినాయకచవితి వేడుకలు మండలంలోని శనివారం ఘనంగా జరిగాయి. దాదాపు అన్ని ప్రధాన కూడళ్లలోనూ భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మీపురం ఆలయం వద్ద ఉంచిన పలు విగ్రహాలను అక్కడి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పు వాయిద్యాల నడుమ ఎంతో అట్టహాసంగా భారీ ర్యాలీల నడుమ ద్వారకా తిరుమలకు తీసుకొచ్చి మండపాల్లో నెలకొల్పారు. తిరుమలం పాలెంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరై పూజలు చేశారు.

వినాయక మండపాల్లో తనిఖీలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 8 : వినాయక చవితి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను రాత్రి వేళ జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మండపాలను పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు.


పెనుమాక లంక గ్రామాన్ని చుట్టుముట్టిన కొల్లేరు


పడవ దిగి సరుకులు తీసుకొని వెళ్తున్న గ్రామస్థులు


చిన్నయడ్లగాడి వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న కొల్లేరు


పెనుమాక లంకకు పడవలో ప్రయాణం చేస్తున్న గ్రామస్థులు



ముంపులో అటపాక పక్షుల కేంద్రం


పెనుమాకలంకలో పాఠశాలలోకి చేరిన నీరు


చేపలు కొల్లేరులో కలవకుండా వల అడ్డంగా కట్టుకున్న రైతులు


ఉప్పుటేరు ముంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, కనుమూరి

వరద గుప్పెట్లో కొల్లేరు గ్రామాలు

» చుట్టుముట్టిన వరద నీరు » మునిగిన రహదారులు » పడవలపైనే రాకపోకలు » ఎమ్మెల్యేల పరిశీలన

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 8: కొల్లేరు ప్రాంతానికి వరద నీరు భారీగా చేరడంతో అనేక గ్రామాలను వరద నీరు చుట్టివేసింది. ఎక్కడ చూసినా సరస్సు నిండా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో చిన్నఎడ్లగాడి-పెద్దఎడ్లగాడి మధ్యలో రహదారిపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, వడ్లకూటితిప్ప గ్రామాలను వరద నీరు తాకింది. అటపాక పక్షుల కేంద్రం చెరువు పూర్తిగా కొల్లేరు ముంపులో కలిసిపోయింది. మండవల్లి మండలంలో నుచ్చుమిల్లి, పెనుమాకలంక గ్రామాలు నీట మునిగాయి. రహదారులు ఎక్కడికక్కడ మునిగిపోవడంతో మరో రెండు రోజుల్లో కొల్లేటి గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి.

కలసికట్టుగా పనిచేసి ముంపును నివారిస్తాం

కొల్లేరు ముంపు బారిన పడకుండా పటిష్ఠ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం ఆలపాడులోని ఉప్పుటేరును వీరు పరిశీలించారు. ఎగువ నుండి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని ఉప్పుటేరులో నీటి ప్రవహానికి అడ్డుగా ఉన్న కిక్కిస తొలగింపుకు చేపట్టవలసిన పనులను అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ వంతెనల వద్ద దట్టంగా చెత్తచెదారం పేరుకుపోవడంతో ముంపు సమస్య ఏర్పడిందన్నారు. ముంపు నివారణ చర్యల్లో భాగంగా ఇరువురు ఎమ్మెల్యేలు కష్టపడి పనిచేసి ఉప్పుటేరులో నీటి ప్రవహానికి అవరోధం లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే ఎక్స్‌కవేటర్లతో ఉప్పుటేరు రోడ్డు బ్రిడ్జిపై నుండి కిక్కిస తొలగిస్తున్నామని మరో రెండు యంత్రాలను ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో తొలగింపు చర్యలు చేపడతామన్నారు. ఆదివారం రాత్రి నుంచి ఈ యంత్రాలు పనిచేస్తాయన్నారు. రైల్వేబ్రిడ్జి వద్ద చెత్తను తొలగించేందుకు ఆధునిక పద్ధతుల్లో యంత్రాలను ఉపయోగించి పనులను నిర్వహిస్తామన్నారు. అలాగే పంటులపై ఎక్స్‌కవేటర్లను పెట్టి నీటి ప్రవహానికి అడ్డుగా ఉన్న వాటిని తొలగించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొల్లేరులో ఆదివారం 3 అంగుళాల మేర నీరు పెరిగిందని మరో రెండు రోజుల్లో ఉప్పుటేరులో అడ్డంకులు తొలగిస్తే వచ్చిన నీరు వచ్చినట్లు సముద్రంలోనికి వెళ్లిపోతుందన్నారు. రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కొల్లేరు వరద బాధిత గ్రామాలకు తక్షణమే ప్రభుత్వ సాయం అందించేందుకు కృషి చేస్తానని ఎలాంటి ఆందోళన చెందవద్దని కామినేని హామీ ఇచ్చారు. తక్కెళ్లపాడు, కొవ్వాడలంక, నుచ్చుమిల్లి గ్రామాలతో పాటు మండవల్లి మండలంలోని నాగభూషణంపురం, మూలపేట, ఉనికిలి గ్రామాల్లో ఎమ్మెల్యే, ఏలూరు ఆర్డీవో షేక్ కాజావలీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీళ్లతో పాటు నిత్యావసర వస్తువులు కూడా లంక గ్రామ బాధితులకు తక్షణమే అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నుచ్చుమిల్లి గ్రామంలో వరద బాధితులకు రేషన్ పంపిణీ చేశారు. పెనుమాకలంక నందిగామలంక, ఇంగిలిపాకలంక గ్రామాల నుంచి వచ్చిన బాధితుల కొందరు ఎమ్మెల్యేకి తమ గోడును వినిపించారు. తాగేందుకు నీళ్లు లేవని, తినేందుకు నిత్యావసర వస్తువులు అయిపోయాయని బయటకు వచ్చేందుకు కూడా వీలు లేని పరిస్థితుల్లో ఉన్నామని తమను తక్షణమే ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కామినేని తక్షణమే సహాయ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామానికి వాహనంపై వెళ్లేందుకు వీలు లేకపోవడంతో బోటులోనే కామినేని నుచ్చుమిల్లి గ్రామం చేరుకున్నారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉనికిలి గ్రామంలో ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సబ్బా బాబి, తెలుగు యువత నాయకుడు పోలా రామచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పెంకుటిల్లు.. తప్పిన ముప్పు



కైకలూరు, సెప్టెంబరు 8: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఇల్లు కూలింది. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామ శివారు శింగాపురంలో పదుల్లపర్తి గంగాభవానీ పెంకుటిల్లు ఆదివారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ఇంటి యజమాని హైదరాబాదులో ఉండగా నాగనబోయిన నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో అద్దెకు ఉంటున్నాడు. సుమారు 50 ఏళ్ల క్రితం మట్టిగోడలతో నిర్మించిన ఇల్లు కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు నాని ఇల్లు నేలకొరిగింది. అయితే ఇంటిలో అద్దెకు ఉన్నవారు చాకచక్యంగా తప్పుకోవడంతో ప్రమాదం జరగలేదు. దీనిపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

చనుబండలో కూలిన పూరిల్లు

చాట్రాయి, సెప్టెంబరు 8: మండలంలోని చనుబండలో భారీ వర్షాలకు గత్తం వీర వెంకయ్య అనే వృద్ధుడికి చెందిన పూరిల్లు శనివారం కూలిపోయింది. ఆ సమయంలో వృద్ధ దంపతులు బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. పూరిల్లు కూలటంతో నిరాశ్రయులమయ్యామని ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. వీఆర్వో శోభనబాబు కూలిన ఇంటిని పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక అందజేస్తానని చెప్పారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు.. హతుడు బాలకోటయ్య (ఫైల్)

ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో వివాదం..

3 నెలల తర్వాత హత్య

ముదినేపల్లి, సెప్టెంబరు 8 : పాత కక్షల నేపథ్యంలో ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిని అతి కిరాతకంగా నరికి చంపాడు. వినాయక చవితినాడు జరిగిన ఈ ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లిలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... ఊటుకూరులో ఈ ఏడాది మేలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటుతోపాటు బాణాసంచా పేల్చిన విషయంలో నిర్వాహకులు గూడవల్లి శ్రీను బాబు అతని కుటుంబీకులకు, మరి కొందరికి సమీప బంధువైన పోసిన బాలకోటయ్య కుటుంబీకులకు మధ్య గొడవలు జరిగాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగిన మరుసటి రోజు తిరిగి ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగగా, బాలకోటయ్య కుటుంబీకులు గూడవల్లి శ్రీను బాబు కుటుంబీకులు నలుగురిని కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై అప్పట్లో ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి బాలకోటయ్య, అతని భార్య, కుమారులను అరెస్టు చేయగా, 31 రోజుల రిమాండ్ అనంతరం జూన్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య కక్షలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెం నుంచి బైక్‌పై ఊటుకూరు వస్తున్న బాలకోటయ్య (54)ను కొందరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో తలపై, మెడపై నరికి హత్య చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న హతుడి భార్య గాయత్రి, కుమారుడు చైతన్య ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకునే సరికే బాలకోటయ్య మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది. తమ మేనమామ కుటుంబంతో ఉన్న పాత కక్షల కారణంగానే తన తండ్రి బాలకోటయ్య హత్య జరిగిందని హతుడి కుమారుడు పోసిన చైతన్య ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రిని గూడవల్లి శ్రీను బాబుతోపాటు శ్రీను, శివాజీ, మహంకాళిరావు, పద్మ, జ్యోతి, ప్రశాంత్ కుమార్, ఉదయ సాయి, నాగరాజు, రాజేష్ హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనా స్థలాన్ని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు పికెట్ ఏర్పాటు

ఊటుకూరు గ్రామం భయం గుప్పెట్లో ఉంది. శనివారం గ్రామానికి చెందిన పోసిన బాలకోటయ్య (54) ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురికావటం, ఇందుకు తమ బంధువులే పాత కక్షలతో హత్య చేశారని హతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఇరు వర్గాల మధ్య మరింత కక్షలు పెరిగి పరిస్థితి ఎటు దారి తీస్తుందోనన్న భయం గ్రామస్థుల్లో కలుగుతున్నది. ఊటుకూరు గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. హత్యకు సంబంధించిన వివరాలను ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌లు ఆదివారం సేకరించాయి. పోలీసు జాగిలాలు నేర స్థలం నుంచి ఊటుకూరు గ్రామం వైపు వెళ్లి తిరిగి నేరస్థలానికి వచ్చాయి.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కలిదిండి, సెప్టెంబరు 8 : విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందాడు. కలిదిండి పంచాయతీ పరిధి ఇందిరా కాలనీకి చెందిన ఊచల ఏడుకొండలు (45) ఆదివారం గొల్లగూడెంలో కట్టా పూర్ణచంద్రరావు రొయ్యల చెరువులో ఏరియేటర్ల ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఏడుకొండలు ఆకస్మికంగా మృతి చెందటంతో కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దచెరువు కట్టతో బహుపరాక్ : ఆర్డీవో


చెక్కపల్లిలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో భవాని శంకరి

ముసునూరు, సెప్టెంబరు 8: మండలంలోని చెక్కపల్లి పెద్దచెరువు కట్ట ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు ఆర్డీవో భవాని శంకరి అన్నారు. ఆమె పెద్దచెరువును పరిశీలించి మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ చెరువు కట్ట ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, అధికారుల ఆధ్వర్యంలో ఇప్పటికే కట్ట బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు, గ్రావెల్‌తో బలోపేతం చేయటం జరిగిందన్నారు. వర్షాలకు బసవరపుపాడు వాగు నుంచి ఈ చెరువులోకి నీరు చేరుతుండటంతో 24 గంటలు చెరువును రెవెన్యూ సచివాయ సిబ్బంది పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడూ పరిస్థితిని తెలియజేయాలని ఆమె ఆదేశించారు. ఈ చెరువు కట్ట తెగే పరిస్థితి నెలకొంటే తక్షణమే ప్రజలను ఇళ్ల నుంచి ఖాళీచేసి, జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సూచించారు. మాజీ ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ, వీఆర్వోలు హరిబాబు, పాయాస్, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చేపలు పట్టేందుకు గానీ, నిండిన చెరువులు చూసేందుకు గానీ, ఆవులు, గేదెలు, మేకలను మేపడం కోసం గానీ బయటకు రావద్దని ఎంపీడీవో అబ్దుల్ సలామ్ తెలిపారు. రోడ్లపై ప్రవహించే నీటి ప్రవాహాలు దాటవద్దని, రైతులు పొలాల వద్ద తడి చేతులతో స్టార్టర్లు, కరెంటు పోల్స్, ఇనుప స్తంభాలు ముట్టుకోవద్దని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 100కు ఫోన్ చేయాలని కోరారు.


కుళ్లిన పైరు పరిశీలిస్తున్న తెలుగు రైతు నాయకుడు జగన్మోహనరావు

పంట నష్టాన్ని అంచనా వేయాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 8 : భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన సార్వా వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు కోరారు. బీజేపీ కైకలూరు నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయి కృష్ణతో కలసి ఆయన ముదినేపల్లి మండలంలో వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. చిగురుకోట, పెయ్యేరు, ముదినేపల్లి గ్రామాల్లో వారం రోజులుగా ముంపులో ఉండి కుళ్లిపోతున్న సార్వా వరి పైరును పరిశీలించారు. పోల్ రాజ్ మేజర్ డ్రైన్ ఉధృతిని చూసి ఈ డ్రైన్ కింది భాగం నుంచి గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులను చేపట్టాలని కోరారు. నష్టం అంచనాకు ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి, కైకలూరు మండలాలతోపాటు గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి మండలాల్లో కూడా అధికారులు బృందాలను నియమించాలని కోరారు. ముదినేపల్లి మండలంలోని పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు, ఇతర మీడియం డ్రైన్లలోని డెక్కను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు సాయికృష్ణ కోరారు.

నేడు పంచాయతీలకు చెక్కుల పంపిణీ

జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనకదుర్గ

కలిదిండి, సెప్టెంబరు 8 : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత నిధుల నుంచి పంచాయతీకి లక్ష చొప్పున అందించే చెక్కులను సోమవారం భైరవపట్నంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పంపిణీ చేస్తారని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ తెలిపారు. ఆదివారం కలిదిండిలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు మైనర్ పంచాయతీలను ఎంపిక చేశారన్నారు. మండవల్లి మండలంలో ముంపునకు గురైన 4 పంచాయతీలు, కైకలూరులో రెండు పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున మొత్తం ఆరు పంచాయతీలకు ఆరు లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందిస్తారని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు. జనసేన నాయకులు చలపతిరావు, నానాజీ, వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంచాయతీలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పంచాయతీకి లక్ష చొప్పున చెక్కులను పంపించగా నేడు ఆ చెక్కులను పంచాయతీల కార్యదర్శులకు నూజివీడు నియోజకవర్గ జనసేన నాయకులు అందించనున్నారు. నూజివీడులోని కృష్ణ విలాస్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని మొత్తం 23 గ్రామ పంచాయతీలకు చెక్కులను పంపారు. ఇందులో ఆగిరిపల్లి మండలంలోని 15 పంచాయతీలు, నూజివీడు మండలంలోని ఆరు, ముసునూరు మండలంలోని 2 పంచాయతీలకు ఈ చెక్కులను అందించనున్నారు. పంచాయతీల ఎంపికపై నూజివీడు మండలంలోని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో చెరువులకు గండ్లు పడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు నష్టపోయిన పంచాయతీలను ఎంపిక చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది.


మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయంలో పూజలు



ఆరుగొలనుపేట.. ముసునూరులో..



కైకలూరు, కలిదిండిలలో పూజలందుకుంటున్న గణనాథులు

జై జై గణేశా..

ఘనంగా వినాయక చవితి పూజలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8: గణేష్ ఉత్సవ కమిటీలు విభిన్న ఆకృతుల్లో మండపాలను ఏర్పాటు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నూజివీడులో బసవ వినయ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట నూజివీడు సంఘం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన దుర్గా గణేష్ విగ్రహాలు పలువుర్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

నూజివీడు: రాష్ట్ర ప్రజలందరి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించాలన్న మంత్రి ఆదేశాల మేరకు క్యాంప్ ఆఫీస్ సిబ్బంది, నియోజకవర్గ నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయంలో వినాయక చవితికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరద సహాయక కార్యక్రమాల్లో ఉన్న మంత్రి పార్థసారథి వర్చువల్‌గా పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయం సిబ్బంది, గణేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముసునూరు: ముసునూరు పోలీస్ స్టేషన్ సమీపంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతికి, శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో మట్టి గణపతికి, పడమట రామాలయంలో విఘ్నేశ్వరుడికి, గోపవరం బీసీ కాలనీలో శాంతి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణక్కపేటలో గణేషుడికి ఎంపీపీ దుర్గాభవాని వెంకట్రావ్ దంపతులు పూజలు చేశారు.

కైకలూరు: కైకలూరులో కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అలాగే అటపాకలో జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ముదినేపల్లి: మండలంలోని 32 గ్రామాల్లో సుమారు 90 మంటపాలు నిర్మించి నిర్వాహకులు గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీహరిపురంలో ప్రతిష్ఠించిన భారీ గణేశుడికి అర్చకుడు ఆసూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు.

కలిదిండి: కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయక విగ్రహానికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భజనలు, కూచిపూడి నృత్యాలు నిర్వహించారు. సర్పంచ్ మారుతి ప్రసన్న, మాజీ జడ్పీటీసీ రమాదేవి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, గోవింద్, మేకా భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, జనసేన నాయకుడు చలపతిరావు పాల్గొన్నారు. కోరుకొల్లు సంత మార్కెట్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఏలూరు, పశ్చిమకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

ఏలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నేత రాజనాల రామ్మోహన్‌ను ఏఐసీసీ నియమించింది. ఉమ్మడి పశ్చిమలో కాంగ్రెస్ వర్గాల్లో సీనియర్ అయిన రామ్మోహన్ ఇంతకు ముందు కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పక్షాన విశేష కృషి చేశారు. షర్మిల కూడా ఆయన పనితీరు పట్ల ఇంతకు ముందే సంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొంటూ ఏఐసీసీ నేతలు సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గేలతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపినట్టు రామ్మోహన్ తెలిపారు.

గణపవరం: పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా పాతపాటి హరికుమార్‌రాజు నియమితులయ్యారు. పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం హరికుమార్‌రాజు నియామక ఉత్తర్వుల కాపీలను స్థానిక విలేకర్లకు అందజేశారు. 1990లో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా రాజకీయ అరంగేట్రం చేసిన హరికుమార్‌రాజు పార్టీ విధేయునిగా ఉంటూ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ఆయన సేవలందించారు. జిల్లా అధ్యక్షుడి పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల, ఏఐసీసీ జనరల్ సెక్రట రీ కేజీ.వేణుగోపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చాట్రాయిలో అత్యధిక వర్షపాతం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా అల్పపీడన ప్రభావంతో 40.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చాట్రాయి మండలంలో 68, అత్యల్పంగా చింతలపూడిలో 12.4 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. ముసునూరులో 49.4, లింగపాలెంలో 45.2, ఆగిరిపల్లిలో 41.8, నూజివీడులో 26.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా మొత్తం 281.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

గండ్లు పూడ్చివేత

చాట్రాయి, సెప్టెంబరు 8: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని కృష్ణారావుపాలెం గొల్ల చెరువుకు ఆదివారం ఉదయం గండి పడి వరద గ్రామంలోకి వచ్చింది. మంత్రి పార్థసారథి ఆదేశాలతో సర్పంచ్ పుల్లారావు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేశారు. వరద ముప్పు తప్పటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు మండలంలోని నరసింహారావుపాలెం ఊరి మధ్యలో ఉన్న కోనేరుకు గండి పడి వరద గ్రామంలోకి వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందారు. జిల్లా తెలుగు రైతు నాయకుడు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు అందే కృష్ణ, పంచాయతీ కార్యదర్శి గోపాల కృష్ణ, వీఆర్వో వినోద్ ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి గండి పూడ్చించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ కాలనీలో వరద నీరు తొలగింపు

ముసునూరు, సెప్టెంబరు 8: మండలంలోని లోపూడి ఎస్సీ కాలనీలో చేరిన వరదనీటిని టీడీపీ నాయకులు ఆదివారం తొలిగించారు. గ్రామంలో వెంకటాద్రి చెరువుకు కళంగి పడి ఎస్సీ కాలనీలోకి వరదనీరు రావడంతో టీడీపీ నాయకులు లక్ష్మపాము కాంతరావు, మాజీ ఎంపీటీసీ పి.వెంకయ్య, నక్కా చెన్నారావు తదితరులు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి వరద నీటిని తొలగించారు. ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



ఆగిరిపల్లి, సెప్టెంబరు 8: ఏపీ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ తరపున శుక్రవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో రూ. కోటిన్నర రూపాయల విలువగల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. సంఘ పాలక మండలి సభ్యుడు, ఎన్ఆర్ఐ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఛైర్మన్ ఆర్. వెంకట్రావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ చిన్నికృష్ణకు అవార్డు



ఆగిరిపల్లి, సెప్టెంబరు 8: సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డ్‌ని స్థానిక ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ కొలుసు చిన్ని కృష్ణ అందుకున్నట్టు ఐకానిక్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఆర్. అనిల్‌కుమార్ తెలియచేశారు. ఆదివారం ఈ అవార్డుని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఇతర ప్రముఖులు చేతుల మీదుగా గుంటూరులోని కెనడీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అందజేశారన్నారు.

ఎంపీపీ ఉమామహేశ్వరరావుకు పితృ వియోగం


కోటేశ్వరరావు

కలిదిండి, సెప్టెంబరు 8 : కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు (77) ఆదివారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బ్రహ్మాజీరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీవో దినతేజ్ కోటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.